క్లుప్తంగా

ఐటీడీఏ డిప్యూటీ ఈఓ పోస్టు భర్తీ చేయాలి

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ డిప్యూటీ ఈఓ పోస్టును సీనియర్ గిరిజన సంక్షేమ ఆశ్రమ హైస్కూల్ హెచ్ఎంల విల్లింగ్ తీసుకుని ఎఫ్ఏసీ ద్వారా భర్తీ చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహన్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో పని చేసిన డిప్యూటీ ఈవో పదవీ విరమణ చేయడంతో పోస్టు ఖాళీ అయిందన్నారు. త్వరగా భర్తీ చేసి ఉపాధ్యాయుల సర్వీసు విషయాలు, పరిపాలన అంశాలకు ఆటంకం కలగకుండా చూడాలని కోరారు.

అర్చక కుటుంబానికి ఆర్థిక సాయం



ధనలక్ష్మికి ఆర్థిక సాయం అందజేస్తున్న సంఘ నాయకులు

భామిని: మండలంలోని బాలేరుకు చెందిన అర్చకుడు దేవల్ల దజనేశ్వరరావు కుమార్తె ధనలక్ష్మి వివాహ సహాయార్థం బుధవారం జిల్లా ఐక్య జంగం సంఘం ఆధ్వర్యంలో రూ.37 వేలు ఆర్థిక సహాయం అందించారు. జిల్లా సంఘం కార్యదర్శి మీగడ సంతోష్, మండల శాఖ అధ్యక్ష, కోశాధికారులు అప్పన్న, విడియాల మన్మధరావుల ఆధ్వర్యంలో సాయం మొత్తాన్ని అందజేశారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్ని ప్రమాదాల గుర్చి వివరిస్తున్న అగ్నిమాపక శాఖాధికారి

సీతంపేట: అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా నాల్గో రోజు బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అగ్నిమాపకశాఖాధికారి జె.సర్వేశ్వరరావు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలను నివారించే పద్ధతులపై వివరించారు. ప్రమాదాలు సంభవించేటప్పుడు 101 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుశాంతోజన, వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేదం చక్కని పరిష్కారం

సీతానగరం: ఆయుర్వేద మందులతో ఎటువంటి సైడ్ఎఫెక్ట్స్ లేని సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని బూర్జ ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి టి.హేమాక్షి అన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం ఆయుర్వేదాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. మండలంలోని కొత్తబూర్జ రామమందిరం ఆవరణలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో పాటు కీళ్లవాతం, కఫం, జీర్ణకోశ, చర్మవ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆయుర్వేద మందులను ప్రతి ఒక్కరూ వాడవచ్చని, వీటి వినియోగంతో దీర్ఘకాల వ్యాధుల నుంచి శాశ్వత ఉపశమనం లభిస్తుందన్నారు. వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఆయుష్ సిబ్బంది పద్మ, నాగార్జున, రూప, ఉపాధ్యాయుడు వై.జోగి నాయుడు పాల్గొన్నారు.

ఉపాధి పనుల వద్ద జాగ్రత్తలు తప్పనిసరి

సీతానగరం: మండలంలో ఉష్ణోగ్రతలు పెరడం వలన ఉపాధి పనుల్లో పాల్గొనే వేతనదారులు వడదెబ్బకు గురికాకుండా ముందు జాగ్రత్త చర్యలుతీసు కోవాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ భాను సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎండలు పెరగడం వలన వేతనదారులు వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. వాతావరణ శాఖ అధికారుల సూచనల మేరకు ముందు జాగ్రత్త చర్యలపై వేతనదారులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో ఉపాధి పనులు చేయించాలని, పని ప్రదేశంలో తాగునీరు, నీడ సౌకర్యం ఉండేలా చూడాలన్నారు.

19న గంగమ్మ ఆలయ ప్రతిష్ట

మక్కువ: మండలంలోని ఎస్.పెద్దవలస గ్రామం సమీపంలో నిర్మించిన గంగమ్మతల్లి అమ్మవారి ఆలయ ప్రతిష్ట ఈనెల 19న నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు బుధవారం తెలిపారు. వేదపండితుల ఆధ్వర్యంలో ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం, అనంతరం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొనాలని కోరారు.



పాలకొండ: కొండాపురం గ్రామంలో సీతారాముల కల్యాణం



జియ్యమ్మవలస: చినమేరంగిలో జరిగిన శ్రీరామ నవమి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి దంపతులు



సీతంపేట: శ్రీరామగిరి క్షేత్రంలో సీతారాముల కల్యాణానికి హాజరైన భక్తులు



గరుగుబిల్లి : పెద్దూరులో కల్యాణంలో పాల్గొన్న భక్తులు



వీరఘట్టం: రామాలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు



గుమ్మలక్ష్మీపురం: శ్రీరామనవమి సందర్భంగా రామమందిరంలో పూజలు

• వైభవంగా సీతారాముల కల్యాణం

జగదానందకారకుడి కల్యాణం శాస్త్రోక్తంగా బుధవారం జరిగింది. అన్ని చోట్ల భక్తుల సందడి నడుమ సీతారాముని కల్యాణం నిర్వహించారు. పట్టణం, గ్రామాల్లో రామాలయాల్లో ఈ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. నీలిమేఘశ్యామా... దశరద నందనా...జగదానందకారకా...నమోఃనమామి అంటూ రామాలయాలకు భక్తులు పోటెత్తారు. పలుచోట్ల కల్యాణం అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. ఉదయం నుంచే రామాలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



భామిని: చిన్నదిమిలి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



కొమరాడ: విక్రంపురం గ్రామంలో సీతారాముల ఉత్సవమూర్తులకు తిరువీధి



పాలకొండ రూరల్: అంపిలి వద్ద నాగావళి నదీ తీరంలో సీతారాముల ఉత్సవమూర్తులకు పవిత్ర స్నానాలు చేయిస్తున్న భక్తులు



భామిని: బాలేరులో సీతారాముల తిరువీధి



కురుపాం: శివ్వన్నపేటలో శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

నాడు నిర్లక్ష్యం.. నేడు అభివృద్ధి పథం!

- ప్రగతి పథంలో తాడింకొండ పంచాయతీ
- కోట్లాది రూపాయలతో సంక్షేమం, అభివృద్ధి
- కురుపాం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఇలాఖాలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ముద్ర

గుమ్మలక్ష్మీపురం:

సీఎం జగనన్న పారదర్శక పాలనకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది.. గుమ్మలక్ష్మీపురం మండలంలోని తాడికొండ గ్రామం. మండల కేంద్రానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ పంచాయతీ పరిధిలో తాడికొండ, ఎగువ తాడికొండ, చాపరాయి జండిగిభద్ర, అడ్డంగి జంగిడిభద్ర, శిఖరపాయి, తోట, ఓద్రుబంగి, కప్పకల్లు గ్రామాలున్నాయి. టీడీపీ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురై, అభివృద్ధికి నోచుకోని ఈ గ్రామంలో ఇప్పుడు అభివృద్ధి కొత్తపుంతలు తొక్కుతోంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి, సంక్షేమం జరుగుతుండడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కుల, మత, రాజకీయ పార్టీల కతీతంగా కోట్లాది రూపాయలతో సంక్షేమాభివృద్ధి జరగడంతో ఇది కదా ప్రజాప్రభుత్వం, ఇది కదా సంక్షేమ పాలన అని పంచాయతీ ప్రజలు అంటున్నారు. సంక్షేమ పాలనపై ప్రశంసలు జల్లు కురిపిస్తున్నారు.



మనబడి నాడు-నేడు కార్యక్రమం ద్వారా అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన తాడికొండ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల(బాలుర)

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి

- రూ.1.10 కోట్లతో ఇరిడి జంక్షన్ నుంచి ఎగువ తాడికొండ గ్రామం వరకు సుమారు 6 కిలోమీటర్ల మేర రహదారిని సుందరంగా తీర్చిదిద్దారు.
- నాడు–నేడు ఫేజ్–1లో భాగంగా రూ.42 లక్షలతో తాడికొండ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల(బాయ్స్)లో విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించారు.
- తాడికొండ ద్రవ్యసహాయక పాఠశాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వంలోకి విలీనం చేసుకొని నాడు–నేడు ఫేజ్–2 కింద రూ.25 లక్షలతో అభివృద్ధి చేశారు.
- రూ.42 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.21 లక్షలతో రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి.
- రూ.52 లక్షలతో తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అధునాతన వసతులు కల్పించారు.
- ఎగువ తాడికొండ నుంచి దేరుగండ గ్రామానికి రూ.40 లక్షలతో రోడ్డు ఫార్మేషన్ (మిషన్ కటింగ్) పనులు చేపట్టారు.
- ఎగువ తాడికొండ నుంచి చాపరాయి జంగిడిభద్ర వరకు బీటీరోడ్డు నిర్మాణానికి రూ.2.60 కోట్లు మంజూరు చేయగా, కల్వర్టుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.
- చాపరాయి జంగిడిభద్ర నుంచి ఓద్రుబంగి గ్రామానికి రోడ్డు ఫార్మేషన్ నిమిత్తం రూ.32 లక్షలు మంజూరు చేశారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి.
- తాడికొండ పీహెచ్‌సీలో నేషనల్ హెల్త్ మిషన్ స్కీం కింద రూ.50 లక్షలతో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ నిర్మాణ పనులు చేపడుతున్నారు.
- పంచాయతీ పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా రూ.5,89,41,594, పరోక్ష నగదు బదిలీ ద్వారా రూ.1,56,18,239 లబ్ధి చేకూరింది.
- రూ.3 లక్షలతో తాడికొండలోని రక్షిత మంచినీటి పథకం మరమ్మతు చేపట్టంతో పాటు ట్యాంకు చుట్టూ రక్షణ గోడ నిర్మాణం.
- రూ.2.90 లక్షలతో తాడికొండలోని పైవీధి నుంచి పంచాయతీ కార్యాలయం వరకు మురుగునీటి కాలువ నిర్మాణం.
- రూ.1.50 లక్షలతో ఎగువ తాడికొండ గ్రామంలోని గ్రావిటీ ద్వారా తాగునీటి సదుపాయం కల్పించడం జరిగింది.
- చాపరాయి జంగిడిభద్ర గ్రామంలో రూ.1.20 లక్షలతో గ్రావిటీ పథకం మరమ్మతు చేపట్టారు.
- రూ.80 వేలతో తాడికొండ పంచాయతీ కార్యాలయం సమీపంలో మినీ రక్షిత మంచినీటి ట్యాంకు ఏర్పాటు.
- రూ.1.50 లక్షలతో శిఖరపాయి గ్రామంలో గ్రావిటీ పథకం ద్వారా తాగునీటి సదుపాయం కల్పించడం జరిగింది.



తాడికొండలో నిర్మాణ దశలో రైతు భరోసా కేంద్రం భవనం



సరికొత్త రూపుదిద్దుకున్న తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



రూ.2.10 కోట్లతో ఇరిడి జంక్షన్ నుంచి ఎగువ తాడికొండకు నిర్మించిన బీటీ రోడ్డు



ఓద్రుబంగి గ్రామానికి జరుగుతున్న రోడ్డు ఫార్మేషన్ పనులు

సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు

పథకం	లబ్ధిదారుల సంఖ్య	అందిన లబ్ధి
జగనన్న అమ్మఒడి	204	రూ.91,08,000
జగనన్న విద్యా దీవెన	69	రూ.11,80,966
జగనన్న వసతి దీవెన	16	రూ.2,93,740
వైఎస్సార్ రైతుభరోసా	387	రూ.1,62,47,450
వైఎస్సార్ సున్నా వడ్డీ (పంట రుణాలు)	3	రూ.7,676
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	26	రూ.55,650
వైఎస్సార్ పెన్షన్ కానుక	265	రూ.2,31,60,750
వైఎస్సార్ చేయూత	131	రూ.51,56,250
వైఎస్సార్ ఆసరా	309	రూ.26,42,523
వైఎస్సార్ సున్నా వడ్డీ (ఎస్‌హెచ్‌జీ)	329	రూ.34,802
వైఎస్సార్ ఆరోగ్య శ్రీ	13	రూ.2,49,981
హౌసింగ్(లబ్ధిదారులకు నేరుగా చెల్లింపులు)	8	రూ.30,350
వైఎస్సార్ బీమా	2	రూ.4,00,000
వైఎస్సార్ వాహనమిత్ర	373	రూ.3,73,000
పరోక్ష ప్రయోజనాలు(నాన్ డీబీటీ)		
ఇంటి స్థలాలు	3	రూ.7,38,000
జగనన్న విద్యా కానుక	209	రూ.14,84,318
విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ	28	రూ.3,70,216
జగనన్న తోడు	17	రూ.3,16,523
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	278	రూ.52,06,940
ఇంటింటికీ రేషన్	299	రూ.65,31,356

అర్హులందరికీ పథకాలు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ గ్రామాల్లోని అర్హులందరికీ అందుతున్నాయి. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో గ్రామ సచివాలయం ఉద్యోగులు చొరవ చూపుతున్నారు. గత నెల వరకూ వాలంటీర్ల సేవలన్నీ ప్రతీ గడపకు చేరేవి. వివిధ పథకాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం వల్ల పేద ప్రజల ఆర్థిక ఇబ్బందులు కొంతమేర తొలగుతున్నాయి.

– మండంగి జగ్గారావు, సర్పంచ్, తాడికొండ



తాడికొండ గ్రామం

తీరిన రహదారి కష్టాలు

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలోని 9వ వార్డు నాగవంశపు వీధి శివారు ప్రాంతానికి రహదారి కష్టాలు తీరాయి. ఏళ్లుగా రహదారి లేక ఇబ్బందులు పడిన వార్డు వాసులకు ప్రభుత్వం గడపగడపకు కార్యక్రమంలో రూ.40లక్షలు మంజూరు చేయడంతో ఈ ప్రాంతంలో సీసీ రహదారులు, కాలువల నిర్మాణం పూర్తి చేశారు. కొత్తగా నిర్మాణం జరిగిన కాలనీ కావడంతో అక్కడ స్థానికుల అవసరాల మేరకు అభివృద్ధి పనులు పూర్తి చేశారు. రూ.8లక్షలతో సీసీ రహదారి నిర్మాణం పూర్తి చేశారు. దీంతో అక్కడి స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



నిర్మాణం పూర్తి చేసుకున్న సీసీ రహదారి, కాలువలు

25 వరకు నామినేషన్ల స్వీకరణ

- రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి

సీతంపేట: ఈనెల 25 వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఉంటుందని పాలకొండ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ కార్యాలయంలోని అంబేడ్కర్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి ఆఫీస్‌లో నామినేషన్‌లను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 18 నుంచి 25 వరకు (సెలవురోజుల్లో మినహా) ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 లోపు నామినేషన్‌లను స్వీకరించనున్నట్లు తెలిపారు. 26న నామినేషన్ ప్రతాల పరిశీలన చేయనున్నామని, అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందన్నారు. మే 13న పోలింగ్ జరుగుతుందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను రిటర్నింగ్ అధికారి కార్యాలయం నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచినట్లు వివరించారు.



కల్పనాకుమారి, పాలకొండ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి

తలతంపరలో అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

సంతకవిటి: మండల పరిధిలోని తలతంపర గ్రామంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన చిలకలపల్లి సూర్యనారాయణ చెందిన 20 ధాన్యం బస్తాలు, వ్యవసాయ పైపులు, 5ఎకరాల గడ్డివాము, రాగోలు అనంతరావుకు చెందిన కరెంటు మీటరు, పశువులశాల, కండ్యాపు సత్యముకు చెందిన 2 ఎకరాల గడ్డివాములు కాలిపోయినట్లు రాజాం ఫైర్ సిబ్బంది తెలిపారు. అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే గ్రామస్తులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా అదుపు చేయలేకపోయారు. విషయం తెలుసుకున్న రాజాం ఫైర్ సిబ్బంది గ్రామానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

ఉపాధి శిక్షణకు ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురంలోని ప్రభుత్వ ఆర్‌ఐటీఐ నందు ఉపాధి శిక్షణ నిమిత్తం గురువారం ఎంపిక నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరులోని స్వర్ణ భారత్ సోమ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌లో 3 నెలల పాటు ఎలక్ట్రిషియన్, లైట్ మోటార్ వెహికల్ రిపేర్ మెకానిక్, కార్ డ్రైవింగ్, టూ వీలర్ మెకానిక్ కోర్సులకు శిక్షణ అందివ్వడం జరుగుతుందన్నారు. టెన్త్ లేదా ఐటీఐలో ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. అలాగే 8వ తరగతి పాసైన వారికి ప్లంబింగ్, వెల్డర్ కోర్సులపై కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు.

శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, శిక్షణ అనంతరం సర్టిఫికెట్ కూడా అందజేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి గలవారు సంబంధిత ధ్రువపత్రాలతో భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీఐకు హాజరు కావాలని కోరారు.

25 వరకు నామినేషన్ల దాఖలకు గడువు

కురుపాం: సార్వత్రిక ఎన్నికల సమయంలో బరిలో నిలవనున్న అభ్యర్థులు ఈ నెల 18 నుంచి 25 వరకు (ప్రభుత్వ సెలవు రోజులు మినహా) నామినేషన్లు దాఖలు చేయవచ్చని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీవీ రమణ బుధవారం తెలిపారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు దాఖలు చేయవచ్చని పేర్కొన్నారు.